క్లుప్తంగా

నేటి నుండి యోగా శిక్షణ

ప్రొద్దుటూరు : ప్రపంచ యోగా దినోత్సవం జూన్ 21న నిర్వహించనున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 25వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లి కార్జున ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ గాంధీ పార్కులో రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు యోగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల ప్రజలు యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అన్నదానం



ప్రొద్దుటూరు : స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో శనివారం యదువంశ వృక్షం కువైట్, ఉద్య సంస్థల అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్య ఆర్గనైజేషన్ స్టేట్ మహిళా అధ్యక్షురాలు శూలం లక్ష్మిదేవి మాట్లాడుతూ చిట్వేలు మండలం గురుగుపల్లి గ్రామానికి చెందిన పునగాని వెంకటేష్ యాదవ్, రమాదేవిల కమారుడు మనోజ్ కుమార్ 18వ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ యాదవ్, హుస్సేన్ పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ అందించాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటసుబ్బయ్య

కాశినాయన : మండలంలో రేషన్ డీలర్లు సక్రమంగా రేషన్ అందించాలని తహసీల్దారు వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్ వాహనాలు రద్దయ్యాయని, డీలర్ల వద్దకే వెళ్ళి రేషన్ తెచ్చుకోవాలని తెలిపారు. రేషన్‌షాపులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు పనిచేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలకు ఇవ్వాల్సిన సరుకులను అందించాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కొట్టాలలో దస్తగిరి స్వామి పండుగ



కొట్టాల గ్రామంలో అందంగా ముస్తాబైన దస్తగిరి స్వామి దర్గా

రాజుపాళెం : పదహారేళ్ల క్రితం గ్రామమంతా కలిసి అంగరంగ వైభవంగా జరుపుకున్న పండుగ ఆదివారం మళ్లీ జరుపుకోనుండటంతో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని టంగుటూరు గ్రామ పంచాయితీలోని కొట్టాల గ్రామంలో ఆదివారం దస్తగిరి స్వామి పండుగ గ్రామస్తులంతా కలిసి వైభవంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే దర్గాకు రంగులు వేయడంతో కళకళలాడుతోంది. అలాగే ప్రతి ఇంటికి బంధువులు, స్నేహితులు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలో దాదాపు 70 ఇళ్లు ఉన్నాయి. చాలామంది ఈ పండుగలో దస్తగిరి స్వామికి మొక్కుబడులు చెల్లించుకుంటారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతారు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి తన సమస్యను తెలుపుతున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్ర

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొన్ని పంచాయతీలలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లను సరైన కారణాలు లేకుండానే తొలిగించిన నేపథ్యంలో పెద్దకాంపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్ర యాదవ్ హైకోర్టు దృష్టికి తనకు జరిగిన అన్యాయాన్ని తీసుకువెళ్లారు. సరైన కారణాలు లేకుండా తొలగించినందున సంబంధిత కేసులో తనను తిరిగి విధులు నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేసారని, ఈ విషయమై ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను కలిసి కోర్టు ఉత్తర్వులను చూపించి విధుల్లో చేర్చుకోవలసిందిగా అభ్యర్థించినప్పటికి పట్టించుకోవడంలేదని ఆవేదనతో తెలిపారు. రెండు రోజుల క్రితం కడప పార్లమెంట్ సభ్యుడు అవినాష్‌రెడ్డితో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను కలసి విధుల్లోకి చేర్చుకోవలసిందిగా విజ్ఞప్తి చేసానని, అయినప్పటికీ అధికారులు విధుల్లోకి తీసుకోవడం లేదని, అధికారులు స్పందించాలని తన ఆవేదనలో తెలిపారు.

కథలు జీవిత వాస్తవాలను స్ఫురింపజేయాలి

కథా రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి



మాట్లాడుతున్న కథా రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి

ప్రొద్దుటూరు కల్చరల్ : కథలు జీవిత వాస్తవాలను స్ఫురింపజేయాలని, పిల్లల కథా రచనలలో సృజనాత్మకతను పెంచే కార్యక్రమమే కథా వసంతమని కథా రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో శనివారం రెండు రోజుల పాటు నిర్వహించే కథా వసంతం 2025 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కథల్లో సాహసకథలు, జంతువుల నీతి కథలు, విద్యాబోధన కథలుగా విభజించి ఉంటాయన్నారు. కథల ద్వారా ఊహాశక్తి పెరుగుతుందన్నారు. ఇది విద్యార్థులకు కీలకమైనదని, సైన్స్ ఆవిష్కరణలన్నీ ఊహ చేసిన తర్వాత నిరూపించబడినవని తెలిపారు. ఏ ఒక్క మనిషి ఒంటరిగా బతకలేదని, కుటుంబం, సమాజం తోడుగా ఉంటుందన్నారు. మన చుట్టూ ఉన్న వారితో, ప్రకృతిలో ఉన్న జంతువులతోనూ, ప్రాణకోటితో ఏర్పడినవే మానవ సంబంధాలని, కథల్లో మానవ సంబంధాలు, వ్యక్తులు, సంభాషణలు కీలకమైనవని అన్నారు. కథా రచయిత దాదా హయత్ మాట్లాడుతూ పర్యావరణం అంశాలను కథల్లో జోడించడం ద్వారా ప్రజలందరికి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చునని తెలిపారు. పర్యావరణంపై కథలు ఈ మధ్యకాలంలో తక్కువగా వస్తున్నాయన్నారు. దీనిపై మరింత కృషి జరగాల్సి ఉందన్నారు. ప్రముఖ కథా రచయిత కావూరి మారుతి విద్యార్థుల్లో దాగి ఉన్న కథా నైపుణ్యాలను వెలికి తీయాలని తెలిపారు. కథలు ఎలా రాయాలో వివరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను పెంచేందుకు కథా వసంతం ఉపయోగపడుతుందన్నారు. కథా వర్క్ షాప్ ద్వారా విద్యార్థులు రాసే కథలతో పుస్తకాన్ని తీసుకురాబోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు సునీత, మురళీగుప్త, మురుకూటి సూర్యానారాయణరెడ్డి, రాజేష్, శిరీష, వేంపల్లి రాజశేఖర్, మీనా తదితరులు పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీ పరీక్షను సద్వినియోగం చేసుకోండి



డీఎస్సీ మోడల్ పరీక్ష కరపత్రాలను విడుదల చేస్తున్న డిప్యూటీ ఈఓ మీనాక్షి, డీవైఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే మోడల్ డీఎస్సీ పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఈఓ మీనాక్షి తెలిపారు. శనివారం స్థానిక డిప్యూటీ ఈఓ కార్యాలయంలో డీఎస్సీ మోడల్ పరీక్ష కరపత్రాలను డిప్యూటీ ఈఓ మీనాక్షి, డీవైఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ డీఎస్సీ నమూనా పరీక్షను డీవైఎఫ్ఐ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ నమూనా పరీక్ష అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ ఈనెల 28న నిర్వహించే మోడల్ డీఎస్సీ పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందిస్తారన్నారు. ఎస్జీటీ అభ్యర్థులకు మాత్రమే మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. డీఎస్సీ మోడల్ పరీక్ష జిల్లా వ్యాప్తంగా జరుగుతుందన్నారు. కడపలో వెంకటసాయి కోచింగ్ సెంటర్, యూటీఎఫ్ భవన్‌లో, ప్రొద్దుటూరులో సృజన కోచింగ్ సెంటర్‌లో, జమ్మలమడుగులో ఎస్వీ డిగ్రీ కాలేజీలో, బద్వేలులో గౌతం కాలేజీలో పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. కడప 9912758515, 966664330, ప్రొద్దుటూరు 8008087023, జమ్మలమడుగు 9100995538, బద్వేలు 9059414222 నంబర్లకు సంప్రదించాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నేడు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు వ ర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నా చంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఇంజనీరింగ్, మెడిసిన్, జేఈఈ, మెయిన్స్‌లో రాణించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను పంపిణీ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయలసీమ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఉడత వెంకట బసవరావ్ పద్మశాలి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ గంజి మల్లికార్జునప్రసాద్ పద్మశాలి, ఏపీ పద్మశాలి సంఘం కో కన్వీనర్ భీమునిపల్లె వెంకట సుబ్బయ్య పద్మశాలి తదితరులు పాల్గొంటారని వివరించారు.

గువ్వలచెరువు ఘాట్‌లో టన్నెల్ నిర్మాణం చేపట్టాలి

పోరుమామిళ్ల : గువ్వలచెరువు ఘాట్‌లో టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీకి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ కడప–రాయచోటి మార్గంలోని గువ్వలచెరువు ఘాట్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతమందో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రెండవఘాట్‌లో లారీ–కారు ఢీకొని జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బద్వేలు నియోజకవర్గంలోని చింతపుత్తాయపల్లె, బి.కోడూరు మండలం మేకవారిపల్లె, గంగిరెడ్డిపల్లెకు చెందిన 5 మంది మృతి చెందడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటన ఆ కుటుంబాల సభ్యులలోటును ఎప్పటికీ భర్తీ చేయలేమని, ఆయన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు.

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ప్రతిఘటిద్దాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అట్లూరు : ఐక్యంగా ఉగ్రవాదాన్ని ప్రతిఘటిద్దామని సీపీఎం మండల కార్యదర్శి ఇ.రమణయ్య తెలిపారు. శనివారం అట్లూరులో పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా మతసామరస్యం – దేశ సమగ్రత పరిరక్షణ సమక్యత యాత్రలు చేపట్టాలని ముద్రించిన కరపత్రాలను సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం పర్యాటక ప్రాంతంలో ఏప్రిల్ 22న పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో 26 మంది పర్యాటకులు బలైపోయారని, దీని ద్వారా ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజనను తీసుకురావాలని, మత విద్వేషాలు రెచ్చగొట్టాలని పథకం పన్నారని, మన దేశ విదేశాంగ కార్యదర్శి మతపరమైన విభజన తీసుకురావడానికి ఈ ఉగ్రదాడి జరిగిందని స్పష్టంగా ప్రకటించారని గుర్తుచేశారు. అయితే దేశ ప్రజలు సమైక్యంగా ఐక్యంగా నిలబడి ఈ పథకాన్ని వమ్ము చేయడాన్ని మతోన్మాద శక్తులకు ఇది నచ్చలేదని, పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా ఆపరేషన్ సిందూర్ భారత ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా మతసామరస్యం, దేశ సమైక్యత, రాజ్యాంగ రక్షణ కోసం ప్రజలందరూ ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సరైన జాగ్రత్తలు తీసుకోనందునే ప్రమాదాలు

పోరుమామిళ్ల : గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బద్వేలు నియోజకవర్గానికి చెందిన నలుగురు మృతి చెందడం, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటం అత్యంత బాధాకరంగా ఉందని ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ చింతపుత్తాయపల్లెకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, ఆయన భార్య సునీత చనిపోవడం, గంగిరెడ్డిపల్లెకు చెందిన తిరుపతిరెడ్డి జర్మనీలో ఉన్నారని, వారి ఇద్దరు పిల్లలు హర్షిని(10), రిషి(12) చనిపోయారన్నారు. నేషనల్ హైవే అథారిటీవారు సరైన జాగ్రత్తలు తీసుకోపోవడం వల్లనే రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మృతి చెందిన వారికి నాగార్జునరెడ్డి సంతాపం తెలుపుతూ, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ప్రతిభా పురస్కారాలు పంపిణీ



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో నరాల బాలిరెడ్డి, వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు చంద్రమోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.1,05,000 అందించారు. ప్రథమ స్థానంలోని నిలిచిన రామేశ్వరం ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి సాదిక్‌కు రూ.25వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచింని వైవీఎస్ మున్సిపల్ గరల్స్ హైస్కూల్ విద్యార్థినులు ఎల్.దివ్యశ్రీ, కె.స్నేహిత లకు ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున, నడింపల్లె మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి చరణ్‌కు రూ.15వేలు అందించారు. వైవీఎస్ మున్సిపల్ గరల్స్ హైస్కూల్, ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు మనీష్, తరుణశ్రీ, తేజ ఒక్కొక్క విద్యార్థికి రూ.5వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రులకు పేరు తేవాలని దాత అమెరికా నుండి నరాల చంద్రమోహన్‌రెడ్డి వాట్సాప్ కాల్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, రిటైర్డు హెచ్ఎం కాశీప్రసాద్ రెడ్డి, హెచ్ఎం అల్తాఫ్, ఉపాధ్యాయులు గంగాధర్ నాయుడు, ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జ్యోతుల ఉత్సవం



బిందె సేవ కార్యక్రమంలో కళాకారులు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలో శనివారం సాయంత్రం జ్యోతుల ఉత్సవం ప్రారంభమైంది. ముందుగా పురం మాను వద్ద ప్రత్యేక పూజలు అనంతరం కళాకారులు నృత్యం చేస్తూ బిందె సేవ నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని చౌడమ్మ ఆలయం వ ద్దకు బ్యాండు మేళాల మధ్య బిందె సేవ కొనసాగించారు. మళ్ళీ ఆలయం వద్ద నుంచి పు రం మాను వక్కపొద్దు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వేకువజామున జమ్మలమడుగు కళాకారులచే జ్యోతుల కడవ బోనం భక్తిశ్రద్ధలతో కొత్తూరు చౌడేశ్వరి ఆలయ నిర్వాహకులు చేపట్టనున్నారు.

చిన్నారిపై అత్యాచార దుర్ఘటన బాధాకరం

ప్రొద్దుటూరు : మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఇర్ఫాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు అమృతానగర్‌కు చెందిన దంపతులు కంబాలదిన్నె గ్రామంలో వివాహానికి హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. వారి చిన్నారికి మాయమాటలు చెప్పి నిందితుడు అత్యాచారం చేసి హత్య చేయడం బాధాకరమన్నారు.

చిన్నారిని అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

కంబాలదిన్నెలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి చంపిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద వారు నిరసన తెలిపి గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. పీఎస్‌వైఎఫ్, ఎన్‌డీఎస్‌ఎఫ్ నాయకులు ఓబులేసు, రమేష్, బయన్న, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పవన్, చందు, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా దేవస్థాన సంప్రోక్షణ మహోత్సవం

లింగాల : కోమన్నూతల గ్రామంలో వెలసిన శ్రీపాలేటి గంగమ్మ దేవస్థాన జీర్ణోద్ధరణ, పు నఃనిర్మాణం జరిగిన సందర్భంగా శనివారం సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సా యంత్రం 5 గంటలకు గ్రామంలోని అన్ని దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలేటి గంగమ్మ ఆలయంలో గణ పతి పూజ, స్వస్తి వాచన, పంచగవ్య, శ్రీపాలే టి గంగమ్మ సంప్రోక్షణ అభిషేకం, దేవాలయ శిఖర కలశ స్థాపన నిర్వహించారు. అదేవిధంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పారిశుధ్య చర్యలు చేపట్టిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



వీధిలోని వర్షపు నీటిని తొలగించిన అధికారులు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని ముస్లిం కాలనీ ప్రధాన వీధిలో నిలిచివున్న వర్షపు నీటిని శనివారం అధికారులు తొలగించారు. శనివారం సాక్షి దినపత్రిలో ప్రచురితమైన 'ఈ వీధిలో వెళ్లేదెలా..!'శీర్షికపై వచ్చిన వార్తపై అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్‌లు ముస్లిం కాలనీలో పర్యటించి అక్కడ కొన్ని రోజులుగా నిలిచి ఉన్న నీటి సమస్యను తెలుసుకుని, ఆ నీటిని అక్కడి నుంచి వెళ్లిపోయేలా చర్యలు చేపట్టారు. నీటి నిల్వకు కారణాలను తెలుసుకుని స్థానికులతో చర్చించారు. ఈ సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. అధికారులు స్పందించి వీధిలో నీటి సమస్యను పరిష్కరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి ఉరిశిక్ష వేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కంబాల దిన్నెలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్యచేసిన నేరస్తుడిని ఉరి తీయాలని ఎంపీజే రాయలసీమ ఇన్‌చార్జి అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు.

శనివారం జిన్నా రోడ్డులోని ఎంపీజే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాష, కార్యదర్శి రఫీ. ముక్తియార్, ఇస్మాయిల్, నజీర్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైశాఖమాసం చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పెనుశిల లక్ష్మీనరసింహస్వామి (పెంచలకోన క్షేత్రం) ఆలయం వరకు జూన్ 15 నుండి 20వ తేదీ లోపు స్వామివారి మహాపాదయాత్ర ఉంటుందని, 11, 9 రోజులు దీక్ష తీసుకునే భక్తులు ఆలయం వద్దకు వచ్చి స్వీకరించవలసిందిగా కోరారు. మహా పాదయాత్రలో పాల్గొనదలచిన భక్తులు ముందుగా ఆలయ నిర్వాహకులకు తెలియజేయాలని కోరారు.

హనుమజ్జయంతి వేడుకల్లో జెడ్పీ చైర్మన్



ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని దిరసవంచ పంచాయతీ బోడపాడు గ్రామంలో జరుగుతున్న హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న ప్రీమియర్ లీగ్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బోడపాడు గ్రామంలో 1960 నుంచి ప్రతి ఏడాది హనుమాన్ జయంతి వేడుకలు 5రోజులపాటు గ్రామస్తులు ఘనంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. క్రీడాకారులు వారి సత్తా ఏమిటో క్రికెట్ ద్వారా నిరూపించుకోవాలన్నారు. అంతకు ముందు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బి.మఠం మాజీ ఎంపీపీ బిజివేముల రామసుబ్బారెడ్డి, బద్వేల్ ఎంపీపీ బి.రమణమ్మ, బి.మఠం మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, నాగిశెట్టిపల్లె పంచాయతీ సర్పంచ్ అనంతరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి

కలసపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట ఏజెన్సీలు, ఆయాలు, వాచ్‌మెన్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం కలసపాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలల్లో తమ శాయశక్తులా కష్టపడి పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ కార్మికులు, హెల్పర్లు, ఆయాలు, వాచ్‌మెన్ల కష్టానికి తగిన వేతనాలు ఇవ్వడంలేదని, కేవలం రోజుకు వంద, రెండు వందల రూపాయలతో కుటుంబాన్ని ఎలా పోషిస్తారో, ఆరోగ్యపరమైన ఖర్చులు ఎలా భరిస్తారో ఆలోచించాలన్నారు. వారికి అందించే నామమాత్రపు గౌరవ వేతనాన్ని కనీసం రూ.10 వేలకు పెంచాలన్నారు. అదేవిధంగా నామమాత్రంగా ఉన్న వంట ఛార్జీలతో పిల్లలకు నాణ్యమైన భోజనం ఎలా అందుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. మెను మార్చినంత మాత్రాన సరిపోదని, ప్రస్తుత నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వంట ఛార్జీలు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినప్పుడల్లా వీరిని తొలగించాలని ప్రయత్నించడం, ఒత్తిడి తేవడం సమంజసం కాదన్నారు. సరైన కారణాలు లేకుండా తొలగించే చర్యలు మానుకోవాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో పాటు వీరి పోస్టులకు చట్టబద్ధత కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం చేపట్టక తప్పదన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా నరసయ్య, ఉపాధ్యక్షుడుగా అహోరాన్, ప్రధాన కార్యదర్శిగా కళావతి, సహాయ కార్యదర్శులుగా రమాదేవి, పీరయ్య, కోశాధికారిగా సుబ్బయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యులు మోహన్, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న శివనారాయణ, బీవీ.రాజు తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కేసీపీ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే బీసీల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీసీ సమాఖ్య సహ అధ్యక్షుడు సందు శివనారాయణ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం సమ్మేళనానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీలు సామాజిక న్యాయం కోసం, రాజ్యాధికారం కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప వారి అభివృద్ధికి కృషి చేయడం లేదన్నారు. బీసీల సంక్షేమానికి, అభివృద్ధి కోసం బీసీ సమాఖ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు యలగాల నూకానమ్మ తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ బీవీ రాజు, జిల్లా అధ్యక్షుడు జింకా జయప్రకాష్, జాయింట్ సెక్రటరి రమేష్, రామసుబ్బయ్య యాదవ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నాన్ బీటీ విత్తనాల సాగు చేయకూడదు



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఖాజీపేట : నాన్ బీటీ విత్తనాలు సాగు చేసేటప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం ఏరువాక శాస్త్రవేత్త డా వీరయ్య, డా.పి.శ్రీవల్లి రైతులకు సూచించారు. ఖాజీపేట మండలం తవ్వారిపల్లె గ్రామంలో నాన్ బీటీ విత్తనాలను జంపన అమరేశ్వర్‌రెడ్డి అనే రైతు సాగు చేశాడు. అయితే పంట సక్రమంగా దిగుబడి రాకపోవడంతో వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పంట పొలాన్ని వ్యవసాయ అధికారుల బృందం పరిశీలించారు. సాగు విధానంతో పాటు సాగు చేసిన విత్తన సంచులను తెప్పించుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాన్ బీటీ విత్తనాలు మన వాతావరణానికి అనువైనవి కావన్నారు. అలాంటి విత్తనాలు రైతులు సాగు చేసేటప్పుడు అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని చెప్పారు. ఇలాంటి విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే రైతులకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని రైతులకు సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగార్జున తోపాటు స్థానిక వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన సెంట్రల్ లైటింగ్ స్తంభానికి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



ఒరిగిన సెంట్రల్ లైటింగ్ స్తంభానికి మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె ఎస్సీ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్ల మధ్యలో సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభం ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉండగా సాక్షి దినపత్రికలో శనివారం 'ఒరిగిన సెంట్రల్ లైటింగ్ స్తంభం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శనివారం మున్సిపల్ సిబ్బంది ద్వారా ఒరిగిన సెంట్రల్ లైటింగ్ స్తంభానికి మరమ్మతులు చేసి యథాప్రకారం నిలబెట్టారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆ ధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కో ర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–28 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండి టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు.